## సెబీ చైర్మన్‌గా తుహిన్ కాంత పాండే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఆర్థిక, రెవెన్యూ కార్యదర్శి తుహిన్ కాంత పాండేను స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాధాబి పూరి బచ్ శుక్రవారంతో తన పదవికాలం ముగియనుండటంతో ఆమె స్థానాన్ని పాండేతో భర్తీ చేసింది. ప్రధాని అధ్యక్షతన అపాయింట్ మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ సమావేశమై ఈ నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగనున్నారు.

## డౌన్ ట్రెండ్‌లో బంగారం, వెండి ధరలు

**మరో రూ.500 దిగిన గోల్డ్ రేటు**


**రూ.2,100 తగ్గిన కిలో వెండి విలువ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. దేశీయ మార్కెట్‌లో శుక్రవారం కూడా డౌన్ ట్రెండ్ కొనసాగింది. నగల వ్యాపారులు, మదుపరులు లాభాల స్వీకరణకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో రెండు వారాల కనిష్ఠాన్ని తాకాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి 10 గ్రాములు రూ.500 తగ్గి రూ.87,700లుగా ఉన్నది. కిలో వెండి రేటు రూ.2,100 పడిపోయి రూ.96,400కు పరిమితమైంది. గురువారం పసిడి విలువ తులం రూ.1,150, కిలో వెండి రూ.1,000 దిగిన విషయం తెలిసిందే. కాగా, బంగారం ధర ఇటీవల ఆల్‌టైమ్ హైని తాకిన సంగతి విదితమే. 10 గ్రాముల మేలిమి పసిడి మునుపెన్నడూ లేనివిధంగా రూ.89,450గా నమోదైంది. అయితే గత వారం రోజులుగా తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్నది బులియన్ మార్కెట్. అయినప్పటికీ ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా చూసినట్లైతే తులం రూ.8,310 లేదా 10.5 శాతం పెరగడం గమనార్హం. జనవరి 1న రూ.79, 390గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ గోల్డ్ రూ.86,840, 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.79,600గా ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 2,862.53 డాలర్లుగా ఉన్నది.

### పతనానికి కారణాలివే..

- ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు
- మదుపరుల్లో వాణిజ్య యుద్ధం భయాలు
- కొనసాగుతున్న ఎఫ్ఐఐల ఉపసంహరణలు
- ఒత్తిడిలో రూపాయి మారకం విలువ
- గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు

# అల్లకల్లోలం



**దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు ప్రవహిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. మదుపరులలో గుబులు పుట్టిస్తున్నాయి మరి. ఇప్పటికే విదేశీ ఇన్వెస్టర్లు భారతీయ మార్కెట్లకు దూరంగా జరుగుతున్న నేపథ్యంలో పెరుగుతున్న ట్రేడ్ వార్ భయాలు సూచీలను కోలుకోనివ్వడం లేదు.**

## స్టాక్ మార్కెట్లలో వాణిజ్య యుద్ధం భయాలు

### ఒక్కరోజే రూ.9 లక్షల కోట్లకుపైగా మదుపరుల సంపద ఆవిరి

### 1,414 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్, 420 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

### గడిచిన 5 నెలల్లో 16 శాతం వరకు నష్టపోయిన సూచీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: దేశీయ స్టాక్ మార్కెట్లను వాణిజ్య యుద్ధం భయాలు చుట్టుముట్టాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు.. అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేయగా, ఆ ప్రభావం భారతీయ ఈక్విటీలపైనా కనిపించింది. శుక్రవారం ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో కదలాడిన సూచీలు.. సమయం గడుస్తున్నకొద్దీ మరింతగా పతనమైపోయాయి. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరైపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు లేదా 1.90 శాతం క్షీణించి 73,198.10 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,471.16 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 420.35 పాయింట్లు లేదా 1.86 శాతం దిగజారి 22,124.70 దగ్గర స్థిరపడింది.

**టారిఫ్‌ల సెగ**

అమెరికాకు దిగుమతయ్యే చైనా ఉత్పత్తులపై అదనంగా మరో 10 శాతం టారిఫ్‌లుంటాయంటూ ట్రంప్ తాజాగా చేసిన ప్రకటన.. యావత్తు మార్కెట్లలో ప్రకంపనల్ని సృష్టించింది. కేవలం దీనివల్లే భారతీయ సూచీలు 2 శాతం వరకు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇప్పటికే పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాల నుంచి వచ్చే దిగుమతులపై 25 శాతం సుంకాలుంటాయని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. కాగా, తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ట్రంప్ దూకుడుతో అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలు కూడా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలహీనపర్చాయి. ట్రంప్ నిర్ణయాలు.. అమెరికాపై ప్రతీకార సుంకాలకు దారితీయవచ్చన్న గుబులు దేశ, విదేశీ మదుపరులను వెంటాడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అమ్మకాల ఒత్తిడిలో ఐటీ**

టెక్ మహీంద్రా షేర్ విలువ అత్యధికంగా 6 శాతానికిపైగా నష్టపోయింది. ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లూ నిరాశపర్చాయి. అలాగే ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, మారుతి, టాటా మోటర్స్, టైటాన్, నెస్లే షేర్లూ పడిపోయాయి. రంగాలవారీగా టెక్, ఐటీ సూచీలు 4.20 శాతం, టెలికం, 4.09 శాతం, ఆటో 3.84 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 2.74 శాతం, చమురు-గ్యాస్ 2.61 శాతం, పవర్ 2.29 శాతం చొప్పున పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు భారీ నష్టాలనే మూటగట్టుకున్నాయి. అమెరికా, ఐరోపా స్టాక్ మార్కెట్లూ ఇదే దారిలో పయనిస్తున్నాయి.

- గత ఏడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్ల ఆల్‌టైమ్ హైని తాకింది. ఇదే రోజున నిఫ్టీ కూడా 26,277.35 పాయింట్ల లైఫ్‌టైమ్ హైని చేరింది.
- గడిచిన 5 నెలల్లో సెన్సెక్స్ 12,780.15 పాయింట్లు లేదా 14.86 శాతం, నిఫ్టీ 4,152.65 పాయింట్లు లేదా 15.80 శాతం నష్టపోయాయి.
- గత 5 నెలల్లో బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.93.91 లక్షల కోట్లు హరించుకుపోయింది. నిరుడు సెప్టెంబర్ ఆఖర్లో రికార్డు స్థాయిలో రూ.478 లక్షల కోట్లుగా ఉన్నది.
- ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.1.20 లక్షల కోట్ల వరకు పెట్టుబడులను ఉపసంహరించుకున్న విదేశీ సంస్థాగత మదుపరులు.

**రూ.9,08,799 కోట్లు**

వరుస నష్టాల నడుమ బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.384 లక్షల కోట్లకు పరిమితమైంది. శుక్రవారం ఒక్కరోజే రూ.9,08,798.67 కోట్లు పడిపోగా.. రూ.3,84,01,411.86 కోట్లకు తగ్గింది. గడిచిన 5 నెలల్లో రూ.93.91 లక్షల కోట్లు క్షీణించింది. నిరుడు సెప్టెంబర్ ఆఖర్లో ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.4,77,93,022.68 కోట్లుగా ఉండటం గమనార్హం. దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో మదుపరులు భయాందోళనకు గురవుతున్నారని, ఎఫ్ఐఐలతోపాటు దేశీయ సంస్థాగత మదుపరులూ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారని మార్కెట్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరికొద్ది రోజులు ఇలాగే ఉంటుందన్న అంచనాలూ వస్తున్నాయి.

## యూపీఐ లావాదేవీల రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: దేశవ్యాప్తంగా యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. జనవరి నెలలో 1,699 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయని, వీటి విలువ రూ.23.48 లక్షల కోట్లుగా ఉన్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఒక నెలలో ఇంతటి స్థాయిలో లావాదేవీలు జరగడం ఇదే తొలిసారని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,31,00 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగగా, వీటి విలువ రూ.200 లక్షల కోట్లకు పైగా ఉన్నదని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో 80 యూపీఐ యాప్స్, 641 బ్యాంకులు యూపీఐ ఎకోసిస్టాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు జరిపేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని తెలిపింది.

## హెడ్జింగ్‌కు డెరివేటివ్‌లు

**ఇన్సూరర్లకు ఐఆర్డీఏఐ ఊరట**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ.. ఇన్సూరెన్స్ కంపెనీలు తమ పోర్ట్‌ఫోలియోల హెడ్జింగ్‌కు ఈక్విటీ డెరివేటివ్‌లను వాడుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఈక్విటీ డెరివేటివ్‌ల ద్వారా హెడ్జింగ్‌పై మార్గదర్శకాలను విడుదల చేస్తూ అనుమతిచ్చింది. ప్రస్తుతం క్యాపిటల్ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకుల్లో కదలాడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మార్కెట్‌లోని బీమా సంస్థల రిస్కును తగ్గించడానికి ఐఆర్డీఏఐ ఈ తాజా నిర్ణయం తీసుకున్నది. నిజానికి ఇన్సూరెన్స్ కంపెనీలే ఈ ప్రతిపాదనను చేశాయి. దీంతో ఐఆర్డీఏఐ దానికి ఆమోదం తెలిపింది.

## కార్మిక క్షేత్రంలో మరో మకుటం

**కేటీఆర్ చొరవతో ముందుకొచ్చిన వస్త్ర పరిశ్రమలు**

- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్
- టీ-షర్టులు, జీన్స్ ప్యాంట్స్ తయారీలో అంతర్జాతీయ ఖ్యాతి
- సిరిసిల్ల జిల్లాలో రెండువేల మందికి లభించనున్న ఉపాధి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): వస్త్ర నగరిగా ఖ్యాతి పొందిన సిరిసిల్ల సిగలో మరో మణిహారం చేరింది. జిల్లాలోని మహిళలు, యువతులకు ఉపాధి కల్పించాలన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షతో రూపుదిద్దుకున్న అపారెల్ పార్కులో అంతర్జాతీయ వస్త్ర తయారీ దిగ్గజ సంస్థ టెక్స్‌పోర్ట్ తమ పరిశ్రమను ప్రారంభించడానికి సిద్ధమైంది. దీంతో టీ షర్టులు, జీన్స్ ప్యాంట్ల తయారీలో రెండువేల మందికి ఉపాధి లభించనున్నది. ఇప్పటికే గోకుల్‌దాస్ సంస్థ ప్రారంభించిన గ్రీన్ నీడిల్ యూనిట్‌లో వెయ్యి మంది మహిళలు, యువతులు ఉపాధి పొందుతుండగా, ఇప్పుడో మరోసారి భారీ ఎత్తున ఉపాధి లభిస్తున్నందుకు జిల్లా ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతున్నది.

**65 ఎకరాల్లో అపారెల్ పార్క్**

మరమగ్గాల వస్త్ర పరిశ్రమలో తెలంగాణకే తలమానికమైన సిరిసిల్లలో మహిళలు, యువతులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో సిరిసిల్లకు మహర్దశ వచ్చింది. బతుకమ్మ చీరెల ఆర్డర్లతో నేతన్నలకు బతుకు చూపింది. బీడీలపై ఆధారపడి పొగచూరిన బతుకుల్లో వెలుగులు నింపాలన్న సంకల్పంతో అప్పటి చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్ జిల్లా కేంద్రంలోని రెండో బైపాస్‌రోడ్డులో రూ.175 కోట్లతో 65 ఎకరాలలో అధునాతన హంగులతో అపారెల్ పార్కును నిర్మించారు. అంతర్జాతీయ కంపెనీలతో పెట్టుబడులు పెట్టించేలా చర్యలు తీసుకున్నారు. 2021 జూలై 30న పార్కులో గోకుల్‌దాస్ ఇమేజ్ కంపెనీ షెడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. రెండేండ్ల వ్యవధిలోనే ఆ కంపెనీ లోదుస్తుల ఉత్పత్తిని ప్రారంభించి వెయ్యి మంది మహిళలకు ఉపాధినిచ్చింది.

**టీ షర్టులు, జీన్స్ ప్యాంట్ల తయారీలో టెక్స్‌పోర్ట్**

రెండు వేల మంది మహిళలు, యువతులకు ఉపాధి కల్పించేందు మరో దిగ్గజ రెడీమెడ్ సంస్థ ముందుకు వచ్చింది. టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ 2021లో మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో అప్పారెల్ పార్కులో 7.41 ఎకరాలలో రూ.75 కోట్లతో షెడ్ల నిర్మాణం చేపట్టింది. పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట యూనిట్‌ను ఏర్పాటు చేసింది. అధునాతన హంగులతో షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఆ సంస్థ ఇప్పుడు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే రెండువేల అత్యాధునిక కుట్టు మిషన్లు, ప్రాసెసింగ్, తదితర మిషన్లు తెప్పించింది. ఇందులో టీ-షర్టులు, జీన్స్ ప్యాంట్స్ తయారు కానున్నాయి. విదేశాల నుంచి తెప్పించిన మిషన్లపై మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ అధికారులు తెలిపారు. బెంగుళూరుకు చెందిన టెక్నికల్ సిబ్బంది, కుట్టులో నైపుణ్యత కలిగిన డిజైనర్లను నియమించింది. కుట్టు శిక్షణలో నైపుణ్యం పొందిన జిల్లా మహిళలకు సూపర్‌వైజర్లుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నది. కంపెనీకి చెందిన డైరెక్టర్లు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

**జిల్లా మహిళలకే ఉపాధి**

అపారెల్ పార్కులో మొత్తం పదివేల మందికి ఉపాధి కల్పించాలన్నది మాజీ మంత్రి కేటీఆర్ సంకల్పం. అందులో జిల్లాకు చెందిన వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే గోకుల్‌దాస్ ఏర్పాటు చేసిన గ్రీన్‌నిడిల్ యూనిట్‌లో వెయ్యి మంది సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన మహిళలు, యువతులే ఉన్నారు. వీరిని కంపెనీకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సులను కంపెనీ ఏర్పాటు చేసింది. సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్కులో జూకీ కుట్టు మిషన్లపై దుస్తుల తయారీలో ప్రభుత్వమే వందలాది మంది మహిళలు, యువతులకు ఉచిత శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం 3500 మంది సుశిక్షితులైన వారికి త్వరలో ప్రారంభించబోయే టెక్స్‌పోర్టు కంపెనీలో ఉపాధి కల్పించనున్నారు. మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితులైన యువతులు, మహిళలు, బీడీ కార్మికులకే ఉపాధి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో మహిళలు, యువతులు రానుపోను బస్సు సౌకర్యం కంపెనీలే కల్పిస్తున్నాయి. ఇంకా అనేక దిగ్గజ రెడీమేడ్ కంపెనీలు సిరిసిల్లకు రానున్నట్టు అధికారులు చెబుతున్నారు.

**టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రత్యేకతలు**

- కొత్తగా ప్రారంభించనున్న టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ అంతర్జాయ ప్రమాణాలతో ఉత్పత్తులు చేస్తుంది
- 1978 నుంచి రెడీమెడ్ రంగంలో అడుగు పెట్టింది
- నాణ్యమైన ఉత్పత్తులు, ఎగుమతులతో సుదీర్ఘమైన అనుభవం కలిగి ఉంది
- ఏటా 17 మిలియన్లకు పైగా దస్తుల ఉత్పత్తులు చేస్తున్నది
- దేశవ్యాప్యంగా ఇప్పటికి 19 కంపెనీలు ఉండగా, సిరిసిల్లలో స్థాపిస్తున్నది 20వది.
- రూ.620 కోట్ల వార్షిక ఆదాయంతో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నది.

# టీచర్స్ ఎమ్మెల్సీ ఎవరో..!

- పోలింగ్‌లో స్వల్ప పెరుగుదల
- తుది పోలింగ్ 93.57 శాతం
- స్ట్రాంగ్ రూమ్స్ వద్ద నిరంతర నిఘా
- పోలింగ్ సరళిపై అభ్యర్థుల సమీక్షలు
- గెలుపుపై ధీమాలో ఎవరికీ వారే
- కీలకం కానున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు
- ఈ నెల 3వ తేదీ నుంచి ఓట్ల లెక్కింపు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : అత్యంత ఉత్కంఠత రేకెత్తిస్తున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇప్పుడు అందరి అంచనాలు గెలుపోటములపైకి మళ్లాయి. గురువారం నాటి పోలింగ్ సరళిని విశ్లేషిస్తూ ప్రధాన అభ్యర్థులంతా శుక్రవారం రోజంతా జిల్లాల వారీగా పరిస్థితిని సమీక్షించారు. ఆయా జిల్లా నాయకత్వాలతో సంప్రదిస్తూ మండలాల వారీగానూ పోలింగ్ సరళి ఎలా ఉందనే దానిపై దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము చేసిన కృషి, చివరి వరకు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రదర్శించిన శక్తియుక్తులు, చివర్లో ఓట్ల కోసం ప్రయోగించిన తాయిలాలు వగైరా అన్నీ కలిపి ఎంతవరకు సఫలమయ్యామన్న దానిపై ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో తమ వ్యూహాలు, ప్రయోగాలు, పోలింగ్ రోజున ఓటర్ల నాడిని బట్టి గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఇవ్వాళ, రేపటి వరకు ఈ గెలుపోటముల చర్చోపచర్చలు సహజం కానున్నాయి. అయితే ఈ నెల 3వ తేదీన కౌటింగ్ జరుగనుంది. సోమవారం మధ్యాహ్నం వరకే ఫలితాల సరళి వెల్లడికానుంది. పోలింగ్ నాటి సరళిని పరిశీలిస్తే ప్రథమ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజేత తేలకపోవచ్చని, ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుందని తెలుస్తోంది. ఇక ఇదే సమయంలో ప్రధాన అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ఎలిమినేషన్ రౌండ్స్ వరకు వస్తే గానీ విజేత తేలకపోవచ్చన్న అంచనాలు ఉన్నాయి.

**నువ్వా నేనా అన్నట్లుగా...**

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సారి టఫ్ ఫైట్ నెలకొన్నట్లుగా పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. 2013, 2019 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ద్విముఖ పోరు కొనసాగగా.. ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా బహుముఖ పోటీ తెరపైకి వచ్చింది. ప్రధాన సంఘాల నుంచి ఎక్కువ మంది కీలక అభ్యర్థులు బరిలో ఉండడం.. అందరూ చివరి వరకు శక్తివంచన లేకుండా గెలుపు కోసం ప్రయత్నించడంతో గెలుపోటములు అంచనాకు అందడం లేదన్న చర్చ వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో గురువారం నాటి పోలింగ్ సరళిపై కీలక సంఘాల నేతలు, అభ్యర్థులంతా శుక్రవారం రోజంతా సమీక్షలు చేస్తూనే కనిపించారు. ప్రధాన సంఘాల అభ్యర్థులు వారి నాయకత్వంతో క్షేత్రస్థాయి వరకు పరిస్థితులను అంచనా వేశారు. ఇక బీసీ సంఘాలతోపాటు ఇతర యూనియన్ల మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులు వారికి సంబంధించిన వారితో లెక్కల్లో మునిగితేలుతున్నారు. మండలాల వారీగా ఉన్న ఓట్లన్నీ పోలైనవి ఎన్ని.. పోలైన వాటిల్లో మనకు ఎన్ని వచ్చి ఉంటాయని ఆరా తీయడంలో బిజీబిజీగా గడిపారు. ఈ క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డిల మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంటుందన్న అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వీరిద్దరూ కూడా తమ యూనియన్ల ద్వారా క్షేత్రస్థాయి వరకు వివరాలు సేకరించిన అనంతరం గెలుపుపై ఎవరికీ వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. యూనియన్ల పరంగా ఈ రెండింటికీ ప్రతీ మండలంలో కార్యవర్గాలు ఉండడం, వారూ నిరంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, పోలింగ్ రోజు వరకు అప్రమత్తంగా ఉండడం లాంటి అంశాల నేపథ్యంలో వీరిరువురూ తమదే గెలుపంటే తమదే నన్న ధోరణిని వ్యక్త పరుస్తున్నారు. ఇక బీసీ సంఘాల మద్దతుతో టీచర్స్ జాక్ అభ్యర్థిగా రంగంలో నిలిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం గెలుపుతో ధీమాతో ఉన్నారు. బలమైన బీసీవాదంతోపాటు గతంలో పీఆర్‌టీయూలో కీలక నేతగా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం, నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లకు సుపరిచితం లాంటి అంశాలన్నీ తన విజయానికి దోహదం చేస్తాయన్న అంచనాలో ఉన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ పీఆర్‌టీయూ నేత గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కూడా తనదే విజయమని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వానికి దగ్గరగా ఉండి.. ఉపాధ్యాయ అధ్యాపక సమస్యలు పరిష్కరించే సత్తా తనకే ఉందని ఓటర్లు విశ్వసించి ఓటేసినట్లు ఆయన పేర్కొంటున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డి కూడా ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన జాతీయవాదం, బీజేపీ మద్దతు, మాజీ ఉపాధ్యాయ నేతగా అనుభవం తదితర అంశాలతో గెలుపుపై ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 3న జరుగనున్న కౌంటింగ్ పైనే అందరి దృష్టి ఉంది.

**కీలకంగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు**

పోలింగ్ సరళిని బట్టి తొలి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలదన్నది స్పష్టం. ఈ నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కీలకం కానున్నాయి. అయితే అభ్యర్థులు తమ ప్రచారంలో తొలి ప్రాధాన్యత ఓట్లపైనే ప్రధానంగా దృష్టి సారిస్తూనే అనుమానం ఉన్న చోట కనీసం రెండో ప్రాధాన్యత ఓటైనా వేయాలంటూ అభ్యర్థించారు. కేవలం ఎన్నికల ప్రచార అంశాలు, అభ్యర్థుల గుణగణాల ఆధారంగా అయితే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పెద్దగా పోలయ్యేవో కావోనన్న సందేహాలు ఉండే. కానీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన అభ్యర్థుల్లో యూటీఎఫ్ మినహా మిగతా వారంతా ఓటర్లను డబ్బు, మద్యం, విందులతో ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం ఈ డబ్బు, మద్యం విందు వినోదాలే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో కీలకంగా మారనున్నాయన్న చర్చ తీవ్రంగా జరుగుతుంది. ఒక అభ్యర్థి నుంచి ఏదైనా కానుక స్వీకరించినప్పుడు మానవనైజం ప్రకారం వారికి ఏదో ఒక ఓటు వేసే తత్వం సహజమే. ఇప్పుడు ఇదే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో కీలకంగా మారనుంది. ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థుల నుంచి తాయిలాలు అందిన ఓటర్లు 1,2,3.. ఇలా ప్రాధాన్యత ఓట్లు వేశారన్న చర్చ ఉంది. ఇలాంటి ఓట్లు ఎవరికీ లాభిస్తాయి? ఎవరికీ నష్టం చేస్తాయన్న చర్చ సర్వత్రా సాగుతోంది. ప్రలోభాలపర్వం కూడా ప్రస్తుతం గెలుపోటములపై స్పష్టమైన అంచనాకు అడ్డుగా నిలుస్తుందని తెలుస్తోంది. ప్రలోభాలపర్వం ప్రభావం ఓటర్లపై ఎక్కువగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ ఫలితం తేలక ఎలిమినేషన్ రౌండ్స్‌కు కౌంటింగ్ దారితీయవచ్చన్న అంచనాలు లేకపోలేదు.

**తుది పోలింగ్‌లో స్వల్ప పెరుగుదల**

గురువారం సాయంత్రం 4 గంటల తర్వాత వెల్లడించిన పోలింగ్‌కు అర్ధరాత్రి తర్వాత పోలింగ్ కేంద్రాల వారీగా సేకరించిన తుది వివరాల ప్రకారం వెల్లడైన పోలింగ్ శాతంలో స్వల్ప పెరుగుదల కనిపించింది. నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం తెల్లారుజామున వెల్లడైన వివరాల ప్రకారం తుది పోలింగ్ 93.57 శాతంగా నమోదైంది. కాగా.. గురువారం సాయంత్రం వివరాల ప్రకారం ఇది 93.55 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లకు గానూ.. 24,139 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12 జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉండగా.. సిద్దిపేటలో 93.98 శాతం, జనగామలో 94.31 శాతం, హనుమకొండలో 91.66 శాతం, వరంగల్‌లో 94.09 శాతం, మహబూబాబాద్‌లో 94.47 శాతం, భూపాలపల్లిలో 94.22 శాతం, ములుగులో 92.83 శాతం, భద్రాద్రి కొత్తగూడెంలో 91.94 శాతం, ఖమ్మంలో 93.05 శాతం, యాదాద్రిలో 96.54 శాతం, సూర్యాపేటలో 94.97 శాతం, నల్లగొండలో 94.75 శాతం పోలింగ్ నమోదైంది. కాగా.. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 3.16 శాతం పోలింగ్ పెరగడం విశేషం. గత ఎన్నికల్లో తుది పోలింగ్ శాతం 90.41 శాతంగా ఉంది. ఈ పెరిగిన పోలింగ్ శాతం ఎవరికీ లాభిస్తుందనేది కూడా ఉత్కంఠత రేకెత్తిస్తోంది. గెలుపుపై ఓటర్లలో చర్చోపచర్చలు సాగుతున్నాయి.

**స్ట్రాంగ్ రూమ్స్‌లో భవిత భద్రం**

గురువారం సాయంత్రం 12 జిల్లాల పరిధిలో పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్స్‌లను ముందుగా ఆయా జిల్లా కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు తరలించారు. అక్కడికి అన్ని చేరాక భారీ బందోబస్తు నడుమ రూట్ల వారీగా శుక్రవారం తెల్లవారుజాము వరకు నల్లగొండలోని అర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలకు తరలించారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌లో జిల్లాల వారీగా బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్ నేతృత్వంలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్‌కు సీల్ వేశారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థతో పాటు 24 గంటలపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో స్థానిక పోలీసులతో పాటు అదనపు ఫోర్స్‌తో నిరంతర నిఘా పెట్టారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలుకానుంది. అంతకుముందే స్ట్రాంగ్ రూమ్స్‌ను ఓపెన్ చేసి బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ హాళ్లకు తరలిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తైనట్లేనని, హాల్స్‌ను సిద్ధం చేశామని, ఏ చిన్న ఆటంకం కలుగకుండా కౌంటింగ్ పూర్తి చేయడమే లక్ష్యమని ప్రకటించారు.



చంచుపల్లి: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు



జూలూరుపాడు: వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఉపాధ్యాయులు

# సైన్స్ మన్.. సీవీ రామన్..!



అశ్వారావుపేట టౌన్: సైన్స్ ఫెయిర్..



గణేష్ టెంపుల్: విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిట్స్

**నా మతం.. సైన్స్..!**

**నా దైవం.. సైన్స్..!!**

**నేను ఆరాధించేది.. సైన్స్!!!**

**ఇలా అన్నది ఎవరో తెలుసా..?**

**చంద్రశేఖర వెంకట రామన్.. సీవీ రామన్.**

**నిన్నటి రోజున ఆయన జయంతిని విద్యార్థులు, ఉపాధ్యాయులు 'సైన్స్ డే'గా జరుపుకున్నారు.**

**ఇంతకీ, ఎవరీయన..!**

**వైజ్ఞానిక శాస్త్రంలో తొలి నోబెల్ పురస్కారం అందుకున్న మన దేశస్తుడు..!**

**ఇంకా చెప్పాలంటే మన తెలుగు గడ్డ విశాఖలో పెరిగి, అక్కడే చదివిన విద్యార్థి..!!**





అన్నపురెడ్డిపల్లి: రామన్‌కు నివాళి



ఇల్లెందు: ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు



చంద్రుగొండ: సైన్స్ ఫెయిర్‌లో ఉపాధ్యాయులు



రామవరం: సైన్స్ డేలో విద్యార్థులు

వైజ్ఞానిక పరిశోధనలంటే ఆయనకు ప్రాణం. అందుకే.. 'నా మతం- సైన్స్, నా దైవం- సైన్స్, నేను ఆరాధించేది- సైన్స్' అని ప్రకటించారు. సంగీత పరికరమైన వీణ (ఆయన తల్లి వీణ వాయించేవారు) నుంచి ప్రారంభమైన ఆయన శాస్త్ర పరిశోధనలు కాలక్రమంలో కాంతి శాస్త్రం వైపుగా సాగాయి. 'రామన్ ఎఫెక్ట్'గా పేరొందిన ఓ పరిశోధనతో ఆయనకు వైజ్ఞానిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ పురస్కారాన్ని తెచ్చిపెట్టిన ఆ పరిశోధన ఏమిటో తెలుసుకోవాలని మనందరికీ ఆసక్తి ఉంటుంది. అదేమిటో చూద్దాం.


ఆయన ఒకసారి ఇంగ్లండ్ నుంచి ఇండియాకు ఓడలో తిరిగొస్తున్నారు. సముద్రం వైపు చూశారు.. నీరంతా నీలపు రంగులో ఉంది. ఆకాశం వైపు చూశారు.. పైన కూడా నీలపు రంగు కనిపించింది. పైన ఆకాశం.. కింద సముద్రపు నీరు నీలంగా ఎందుకు ఉన్నదన్న ప్రశ్న తలెత్తింది.




పాల్వంచ: సైన్స్ ఎక్స్‌పో



చర్ల: రామన్ జయంతి వేడుక



పాల్వంచ: సైన్స్ డేలో టీచర్లు, విద్యార్థులు



కరకగూడెం: రామన్‌కు నివాళి

ఆలోచనలను రేకెత్తించింది. తన చుట్టూ ఉన్న కొందరిని అడిగారు. 'పైన ఆకాశం నీలపు రం గులో ఉంది. దాని ప్రతిఫలంతోనే సముద్రపు నీరు కూడా అదే రంగులో ఉంది' అని చెప్పారు. మన రామన్‌కు ఏమాత్రం సంతృప్తి కలగలేదు. ఈ అసంతృప్తి, ఆలోచనల నుంచి అద్భుతమైన ఆవిష్కరణ బయటికొచ్చింది. 'సముద్ర జలంలోని అణువులు.. సూర్య కాంతిని వివిధ వర్ణాలు గా విడదీసి వెదజల్లుతాయి. నీలి రంగు కిరణాలు మాత్రం.. నీటిలో ఎక్కువ లోతుకు చొచ్చుకుపో యి ప్రతిఫలిస్తాయి. దాని ఫలితంగానే, సముద్ర పు నీరు నీలి రంగులో కనిపిస్తుంది' అని, పరిశోధనాత్మకంగా రామన్ తేల్చి చెప్పారు. 'ఏదేని వ స్తువు మీద కాంతి కిరణం పడితే.. అది పరావర్త నం చెందుతుంది. అలా అది తన గమనాన్ని మార్చుకుంటుంది' అని, పరిశోధనాత్మకంగా నిరూపించారు. దీనిని, అద్భుతమైన 'రామన్ ఎఫెక్ట్'గా యావత్ ప్రపంచం గుర్తించింది. దీనికే ఆయనకు 1930లో నోబెల్ బహుమతి లభించింది. అలా, మన సీవీ రామన్.. 'సైన్స్ మన్'గా నిలిచారు..! జిల్లావ్యాప్తంగా ఆయన జయంత్యుత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు 'సైన్స్ డే'గా జరుపుకున్నారు. రామన్ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు పైన విషయాలన్నీ, విశేషాలన్నీ వివరించారు.

**- నమస్తే నెట్‌వర్క్**